నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, బుధవారం 13 నవంబర్ 2024 | WARANGAL

ఎంజీఎంలో టెస్టుల దందా

- వార్డుల్లోకి వచ్చి శాంపిల్స్ సేకరిస్తున్న ప్రైవేట్ వ్యక్తులు
- వైద్య సిబ్బంది, ల్యాబ్‌ల నిర్వాహకులకు వాటాలు

వరంగల్ చౌరస్తా, నవంబర్ 12: వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానలో రోజు రోజుకు ఉచిత సేవలు కనుమరుగవుతున్నాయని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రసాయనాలు అందుబాటులో లేకపోవడంతో పారా మెడికల్ సేవలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. దీంతో రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ప్రైవేట్ ల్యాబ్‌ల నిర్వాహకులు అవకాశంగా భావించి రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఎంజీఎం వైద్య సిబ్బంది వారికి రెడ్ కార్పెట్ వేసి మరీ ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లను వార్డుల్లోకి అనుమతిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే టెస్టులకు సైతం వందల రూపాయలు వసూలు చేస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. వైద్య సిబ్బంది, ల్యాబ్‌ల నిర్వాహకులు వాటాలు పంచుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

శాంపిల్స్ సేకరిస్తున్న ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్

రావమ్మా.. మహాలక్ష్మీ!

ఆడ బిడ్డకు అపూర్వ స్వాగతం పలికిన కుటుంబ సభ్యులు

ఇంటి ముందు పూలతో అలంకరణ

కూతురుతో ఇంట్లోకి వస్తున్న తల్లిదండ్రులు

కేసముద్రం, నవంబర్ 12 : ఆడపిల్ల అంటే మొదటి నుంచీ చులకనే. తొలి కాన్పులో తన కొడుక్కు వారసుడే రావాలని, బిడ్డకు కుమారుడే పుట్టాలని కోరుకునే తల్లిదండ్రులు లెక్కలేనంత. కడుపులో ఉన్నది ఆడ పిల్ల అని తెలిస్తే గర్భస్రావం చేయించే వారూ ఉన్నారు. ఆడ పిల్ల పుట్టిందని రోడ్డు పక్కన పడేస్తున్న కాలం. ఇలాంటి సమయంలో పుట్టిన ఆడ బిడ్డకు ఓ కుటుంబం అపూర్వ స్వాగతం పలికింది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన కొడకంటి క్రాంతికుమార్-సుమ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. అయితే తమకు ఆడ పిల్ల కావాలకున్న ఆ తల్లిదండ్రులకు మూడో కాన్పులో ఆ భాగ్యం దక్కింది. దీంతో ఆ కుటుంబం ఆనందంలో మునిగి తేలింది. మంగళవారం మహబూబాబాద్‌లోని ఆస్పత్రి నుంచి తల్లీ బిడ్డను డిశ్చార్చి చేయగా, ఇంటి ముందు వాకిలిని పూలతో అలంకరించి రావమ్మా.. మహాలక్ష్మీ అంటూ అపూర్వంగా స్వాగతం పలికి సంబురాలు నిర్వహించారు.

ఇద్దరు పోలీసులకు అతి ఉత్కృష్ట సేవా పతకాలు

సుబేదారి, నవంబర్12: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని కేయూసీ, హనుమకొండ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మల్లారెడ్డి, కానిస్టేబుల్ కే మహేశ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వ అతి ఉత్కృష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు.1990 బ్యాచ్‌కు చెందిన మల్లారెడ్డి విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి అనేక అవార్డులు అందుకున్నారు. మహేశ్ 1996లో పోలీసు ఉద్యోగంలో చేరి సమర్థవంతంగా విధులు నిర్వర్తించి రివార్డులు తీసుకున్నారు. మల్లారెడ్డి దామెర మండలం కోగిల్వాయి వాసి కాగా, మహేశ్‌ది కమలాపూర్ మండలం ఉప్పల్. ఈ సందర్భంగా వీరిద్దరిని సీపీ అంబర్ కిశోర్‌ఝా అభినందించారు.

మల్లారెడ్డి, మహేశ్‌కుమార్

కాంగ్రెస్ సర్కారు తలపెట్టిన 'సమగ్ర కుటుంబ' సర్వేతో అందరిలో టెన్షన్ పట్టుకుంది. వివరాల కోసం వచ్చే ఎన్యుమరేట్లు అడిగే ప్రశ్నలు, వారు సేకరించే సమాచారంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైకి 56 ప్రశ్నలే కనిపిస్తున్నా.. ఉప అంశాలు కలిపి చూస్తే 75 అంశాలతో పూర్తి సమాచారం సేకరించేందుకు వీలుగా రూపొందించారు. అయితే ఎక్కువగా కుటుంబ, వ్యక్తిగత వివరాలే ఉన్నందున ఉన్నది ఉన్నట్టు చెబితే పాత రేషన్‌కార్డులు.. గత ప్రభుత్వ హయాం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు ఉంటాయా? పోతాయా? అని సవాలక్ష సందేహాలు ఇటు ప్రజలను, ప్రభుత్వ ఉద్యోగులనూ వెంటాడుతున్నాయి. అందుకే చాలాచోట్ల ఆదాయం, ఆస్తుల వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇచ్చినా వాస్తవ సమాచారం ఇవ్వడం లేదనే ప్రచారం జరుగుతుండగా సర్వే కోసం వచ్చే వారికి తమ కార్లు, ఇతర వాహనాలు కనిపించకుండా జాగ్రత్తలు పడుతున్నట్లు తెలుస్తోంది.

- జనగామ, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ)


ఆత్మకూరు : నీరుకుళ్లలో సర్వేను పరిశీలిస్తున్న హనుమకొండ జిల్లా ప్రణాళికాధికారి సత్యనారాయణరెడ్డి

సర్వే టెన్షన్

సర్కారు 'సమగ్ర సర్వే'కు సవాలక్ష అడ్డంకులు

- వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్న ప్రజలు
- సామాన్యులు సహా ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ ఆందోళన..
- ఆస్తులు.. ఆదాయం వివరాలకు నో
- గత పథకాలు పోతాయనే గుబులు?
- తెల్లరేషన్‌కార్డు ఉంటదా? పోతదా? అని దిగులు
- కార్లు, వాహనాలు సర్వే సిబ్బంది కంటపడకుండా జాగ్రత్తలు

రాష్ట్ర ప్రభుత్వం మొదలుపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై (సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే) ఇటు సామాన్య ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ భయం పట్టుకుంది. ప్రభుత్వం సర్వే పేరుతో అనేక వ్యక్తిగత వివరాలు సేకరించడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సర్వే సమయంలో అధికారులు, సిబ్బంది అడిగే అన్ని వివరాలు ఇవ్వాలా? వద్దా? అనే సందేహాలు ప్రజల్లో కనిపిస్తున్నది. ఒకవేళ ఆదాయ పన్ను చెల్లిస్తున్నామని చెబితే సంక్షేమ పథకాలు వర్తిస్తాయా? లేదా? అన్న అనుమానాలు అందరిలోనూ ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా, రుణమాఫీ కోసం అనేక కొత్త నిబంధనలు పెట్టింది. ఆదాయ, వాణిజ్య పన్ను వంటివి చెల్లించే వారికి సంక్షేమ పథకాలు, తెల్లరంగు రేషన్ కార్డు తొలగించాలన్న వాదన తెరపైకి వస్తున్నది. దీంతో ఏం చెప్పాలి..? ఏం చెప్పకూడదు అనే సంశయం నెలకొన్నది. సర్వేకు అధికారులు, సిబ్బంది వస్తున్నారంటే ఇంటి ముందున్న కారు, ద్విచక్ర వాహనం వంటి ఇతర చరాస్తులు కంటపడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు సర్వే కాలం నంబర్ 20లో పొందుపరిచిన అంశాన్ని పరిశీలిస్తే.. మీరు ప్రస్తుతం ఏం పని చేస్తున్నారు? అని.. దీనికి అనుసంధానంగా కాలం నంబర్ 23లో వ్యాపారం, రియల్ ఎస్టేట్, పారిశ్రామికవేత్త అయితే వార్షిక టర్నోవర్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. కాలం నంబర్ 29లో మీరు ఆదాయ పన్ను చెల్లిస్తున్నారా? అని ఉంది. అలాగే కాలం 30లో మీకు బ్యాంకు ఖాతా ఉందా? లేదా? కులవృత్తిదారులకు సంబంధించి వార్షిక ఆదాయ వివరాలు సహా కాలం 31 నుంచి 40వరకు భూముల వివరాల్లో ధరణి పాస్‌పుస్తకం సహా తరి, ఖుష్కి, పడావు భూములు, పట్టా? ఇనాం, ప్రభుత్వానిదా? అనే వివరాలు అడిగారు. పార్టు-2లో ఇంటి యజమానుల స్థిర, చరాస్తుల వివరాలు, నివాస గృహ విస్తీర్ణం నుంచి మొదలు ఇంటిలో గదుల సంఖ్య వరకు వివరాలు సేకరిస్తున్నారు. రైతుభరోసా పథకాన్ని 5 ఎకరాలకు కుదించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో వివరాలు సమగ్రంగా సేకరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన కోసం జనగామ జిల్లాలో 1,62,512 కుటుంబాలు, 1,350 బ్లాకుల్లో సర్వే కోసం 1,350 మంది ఎన్యుమరేటర్లు, 145 మంది సూపర్‌వైజర్లను నియమించి ఈ నెల 6 నుంచి 8 వరకు ఇంటింటికీ స్టిక్కర్లు వేసి.. 9నుంచి కుటుంబ సర్వేను ప్రారంభించారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 ఇండ్లు కేటాయించి ప్రతిరోజూ 10 ఇండ్ల సర్వే పూర్తి చేయాలన్న విధివిధానాలతో అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చి సర్వే వివరాల నమోదును ప్రారంభించారు.

తెల్లరేషన్ కార్డులకు ఎసరు?

సర్వేలో సేకరిస్తున్న సమాచారాన్ని బట్టి చూస్తే ఇప్పటికే అమల్లో ఉన్న తెల్లరేషన్ కార్డులుంటాయా? ఊడుతాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకాన్ని రేషన్‌కార్డుతో ముడిపెట్టకుండా డిజిటల్‌కార్డులు ఇస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో కుటుంబ యజమాని స్థిర, చరాస్తుల వివరాలు ఇస్తే కార్డులు పోయే ప్రమాదం లేకపోలేదనే అనుమానాలు వస్తున్నాయి. ఆస్తులు మాత్రమే కాదు.. అప్పుల వివరాలు కూడా సేకరిస్తున్నట్టు ఫార్మాట్‌లో ఒక అంశాన్ని చేర్చింది. అయితే నూటికి 90శాతం కుటుంబాలకు ఏదో రూపంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్దో లేదా బ్యాంకుల్లోనో అప్పు ఉంది. ఆస్తుల వివరాలు చెబితే ఉన్నవి ఊడపీకేస్తుంది తప్ప.. అప్పుల వివరాలు చెబితే ప్రభుత్వం ఏమైనా తీరుస్తుందా? అన్న ప్రశ్న ప్రజల్లో తెలెత్తుతున్నది. అప్పుల పేరుతో ఆస్తుల వివరాలు సేకరించడమే లక్ష్యంగా సర్వే ఫార్మాట్‌ను రూపొందించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటితో పాటు ఇంటి విస్తీర్ణం, ఇంట్లో వాడుతున్న గదులు వంటి అంశాలను బట్టి చూస్తే ఇంటి కరెంటు బిల్లు మాఫీకి కోతలు పెట్టవచ్చనే అనుమానాలు ఉన్నాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను ఒక రోజులోనే పూర్తిచేసి అదనపు సంక్షేమ కార్యక్రమాలు విస్తరించి తప్ప కోతలు పెట్టలేదు. కొర్రీలు పెట్టకపోగా.. కొత్తగా రైతు రుణమాఫీ, రైతు బంధు, దళితబంధు లాంటి పథకాలు పెట్టిందని గుర్తుచేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రుణమాఫీ, రైతు భరోసా వంటి వాటిపై స్పష్టత ఇవ్వకుండా సాగదీత ధోరణి అవలంబిస్తూ ఆరు గ్యారంటీల అమలులో తిరకాసు పెట్టాలన్నది లోగుట్టుగా కనిపిస్తున్నదనే చర్చ నడుస్తున్నది. ఈ నేపథ్యంలో సర్వే అధికారులు, సిబ్బందికి ప్రజలు సంపూర్ణ వివరాలు ఇవ్వడం లేదు. ఒకవేళ ఇచ్చినా వాస్తవాలు మాత్రం చెప్పడం లేదనే ప్రచారం జరుగుతోంది.

సర్వే చేయలేకపోతున్నాం

నర్సింహులపేట, నవంబర్ 12 : 'క్షేత్రస్థాయిలో సర్వేతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.. ఒక పూట బడి.. మరో పూట సర్వే వల్ల సమయానికి పూర్తి చేయలేకపోతున్నా'మని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోజుకు 15 నుంచి 20 కుటుంబాలు పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారని చెబుతున్నారు. ఒక కుటుంబానికి కనీసం 40 నిమిషాల సమయం పడుతున్నదని దీని వల్ల రోజుకు 5, 10 కుటుంబాల సర్వే మాత్రమే సాధ్యమవుతున్నందున స్థానిక సిబ్బందిని నియమించాలని నర్సింహులపేట మండలానికి చెందిన టీపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వై.క్రాంతికుమార్, ఎనమాల శ్రీనివాస్ కోరుతున్నారు. ఈమేరకు మంగళవారం వేణుగోపాల్, యాకన్నతో కలిసి ఎంపీవో యాకయ్యకు వినతిపత్రం అందించారు.

ఎంపీవో యాకయ్యకు వినతి పత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

గ్రేటర్‌లో మందకొడిగా సర్వే

- 37,102 గృహాలు పూర్తి
- ఇబ్బందులు పడుతున్న ఎన్యుమరేటర్లు

వరంగల్, నవంబర్ 12 : గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటి సర్వే మందకొడిగా సాగుతున్నది. మంగళవారం నాటికి 37,102 గృహాల్లో సమగ్ర కుటుంబ, కుల సర్వే నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాగుతున్న సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు రోజులో 10 లోపు ఇళ్లు మాత్రమే సర్వే చేస్తున్నారు. బల్దియా పరిధిలోని 66 డివిజన్లలో 2,90,969 గృహాలు ఉన్నాయి. నాలుగు రోజులుగా సాగుతున్న సర్వేలో ఇప్పటి వరకు 37 వేల గృహాల సర్వే పూర్తయ్యింది.

క్షేత్రస్థాయిలో ఇబ్బందులు

ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో సర్వేలోని ప్రశ్నలకు ప్రజలు సమాధానాలు చెప్పడం లేదు. దీనికి తోడు దివ్యాంగుల కాలమ్‌లో సరైన వివరాలు లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. ఆర్థిక, స్థిర, చరాస్తులకు సంబంధించిన సమాచారం చెప్పేందుకు ప్రజలు ఇష్టపడక పోవడంతో వారిచ్చిన సమాచారంతో సర్వే పూర్తి చేస్తున్నారు.

కాజీపేట రైల్వేస్టేషన్‌లో కుక్కలు

ప్లాట్‌ఫాంపై ఉన్న చెత్త డబ్బాలను చెల్లాచెదురు చేసిన కోతులు

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల మధ్యలో తిరుగుతున్న వీధి కుక్కలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

కాజీపేట, నవంబర్ 12: కాజీపేట రైల్వే స్టేషన్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ప్లాట్‌ఫాంలపై విచ్చలవిడిగా తిరుగుతూ ప్రయాణికులను భయభ్రంతులకు గురిచేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం, చెన్నైలకు వెళ్లే గోదావరి, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ తదితర ముఖ్య రైళ్లు వచ్చాయంటే ప్రయాణికులు స్టేషన్‌లో పడేసిన వ్యర్థ పదార్థాలను తినేందుకు అక్కడికి చేరుకుంటున్నాయి. రాత్రి వేళల్లో రైలు వచ్చిందంటే కుక్కలు అక్కడికి వచ్చి రాకపోకలు సాగించే వారిని కరుస్తున్నాయి. ప్రయాణికులు కాళ్ల మధ్యనే తిరుగుతుంటాయి. స్టేషన్‌కు రెండు మూడు రైళ్లు ఒక్కసారే రావడంతో రైలు ఎక్కేందుకు పరుగులు పెడుతుంటే కుక్కలను తాకినా, వాటి ముందు పరుగెత్తినా కరుస్తున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని వారు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి జంక్షన్‌లో వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

రైల్వే అధికారులు స్పందించాలి

స్టేషన్‌లో వీధి కుక్కలు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాటిని చూసి స్టేషన్‌కు వచ్చే వారు భయపడుతున్నారు. కుక్కల దాడులను అరికట్టేందుకు అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.
అశోక్, ప్రయాణికుడు

కుక్కలు, కోతుల బెడదను నివారించాలి

రైల్వే ప్లాట్‌ఫాంలపై వీధికుక్కలు, కోతుల సమస్య తీవ్రంగా ఉంది. అవి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కోతులు చేతులోని వస్తువులను లాక్కొని వెళ్తున్నాయి. రైల్వే స్టేషన్‌లో కుక్కలు, కోతుల బెడదను నివారించాలి. - కృష్ణ, ప్రయాణికుడు

జీఎంహెచ్‌లోని వార్డు పక్కన ఎలుకల సంచారం

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఎలుకలు

- భయాందోళనలో మహిళలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 12: హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి దవాఖాన (జీఎంహెచ్)లో ఎలుకలు సంచరిస్తున్నాయి. ఉన్నతాధికారులు, వైద్యుల పట్టింపులేనితనంతో దవాఖానకు వచ్చేవారికి ఇబ్బందులు తప్పడంలేదు. సోమవారం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షే మ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆస్పత్రిని తనిఖీ చేసి దవాఖానకు వచ్చేవారికి మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. జీఎంహెచ్‌లోని 12వ నంబర్ లేబర్‌రూంకు వెళ్లేదారి, వార్డు పక్కన, ఆపరేషన్ థియేటర్ పక్కన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఎలుకలు ఎక్కువయ్యాయి. వర్షం పడితే డ్రైనేజీ నుంచి పక్కనే నిత్యం వాటి సంచారం ఉంటుందని పేషెంట్లు వాపోతున్నారు. ఆహార పదార్థాలను తింటుండంతో దవాఖానకు వచ్చేవారు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నా, పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఎలుకల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు బీఆర్ఎస్ బృందం వినతి

కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ ప్రతినిధులు

హనుమకొండ, నవంబర్ 12: స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్, బీసీల కుల గణన వంటి అంశాల అమలులో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల బృందం బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావును మంగళవారం హైదరాబాద్‌లో కలిసింది. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ సమగ్ర సర్వేను స్వాగతి స్తూనే అందులోని కొన్ని ప్రశ్నలు అభ్యంతరకరంగా ఉన్నాయని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. కులగణన పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. బడ్జెట్లో అత్యధిక నిధులు బీసీల అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించేలా చూడాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు అయ్యాయని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ పథకాల అమలు అయ్యేలా చొరవ చూపాలని కోరారు. మహాత్మా జ్యోతీరావు పూలే విదేశీ విద్యా నిధి అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా బృందం సభ్యులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

జర్నలిస్టుల హామీలను విస్మరించిన రేవంత్

- రూ. 250 కోట్ల అభివృద్ధి పనులు రద్దు చేయడం సిగ్గుచేటు
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, నవంబర్ 12 : జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను రేవంత్ సర్కార్ విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నర్సంపేట డివిజన్‌లో పని చేస్తున్న జర్నలిస్టుల ఇండ్ల నిర్మాణం కోసం రూ. 7.50 కోట్లతో టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా, దానిని అగ్రిమెంట్ దశలో నిలిపివేసింది ఎవరో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల నోటికాడి బుక్కను లాక్కోవడం హేయమైన చర్య అన్నారు. వడ్డించిన విస్తరిని లాక్కోవడం కాంగ్రెస్ పార్టీ నైజమని దుయ్యబట్టారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందాక ప్రజల రుణం తీర్చుకునేందుకు గోదావరి జలాలను తరలించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశానన్నారు. అంతేగాక విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తారు, సీసీ రోడ్ల కోసం రూ. 250 కోట్ల నిధులు విడుదల చేస్తే, కాంగ్రెస్ పాలకులు ఆ పనులను నిలిపివేయడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలలైనా ప్రభుత్వం ఇప్పటికీ బీఆర్ఎస్ హయాంలోని పథకాలనే అమలు చేస్తున్నదని, అలాగే తాము చేపట్టిన ఉద్యోగాలు, నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను పంపిణీ చేస్తున్నదే తప్ప, ఇప్పటికీ రాష్ట్రంలోని ఏ ఒక్క గ్రామంలో అభివృద్ధి కోసం తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేయకుండా అభివృద్ధి వైపు దృష్టి సారించాలని పెద్ది సుదర్శన్‌రెడ్డి హితవు పలికారు.

పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలు

మంగపేట, నవంబర్ 12 : ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని ముస్లిం వీధి, పొదుమూరు తదితర ప్రదేశాలకు చెందిన పలువురు తమ పనుల్లో ఉండగా వారిని పిచ్చి కుక్క దాడి చేసి గాయపరిచింది. గాయపడ్డ వారికి స్థానిక పీహెచ్‌సీలో వైద్య చికిత్స చేశారు. మండలంలోని కమలాపురం, బోరునర్సాపురం, పొదుమూరు, గంపోనిగూడెం గ్రామాల్లో ఇటీవల పిచ్చి కుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పిచ్చి కుక్కల బారినుంచి తమనుకాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గోవర్ధన్ (ఫైల్)

దుగ్గొండి, నవంబర్ 12 : యాసంగి దుక్కికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మందపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం మేరకు గ్రామానికి చెందిన రైతు వరికెల గోవర్ధన్ (50) తన కలిసి యాసంగి పంట కోసం నీరు పెట్టేందుకు పొలం వద్దకు కుమారుడితో కలిసి వెళ్లారు. మోటర్ సరిగా పనిచేయకపోవడంతో కొడుకును స్పానర్ల కోసం ఇంటికి పంపించాడు. అనంతరం బోర్డు వద్ద ఫ్యూజులు తీస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడికి భార్య ఉమ, ఇద్దరు కుమారులున్నారు.